సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 24 । జూన్ । 2025



చేతకాకపోతే గద్దె దిగండి

హామీలు నెరవేర్చలేని చంద్రబాబు వెంటనే గద్దె దిగాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. 8లో



టన్ను చీనీ రూ.27 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.27 వేలు, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం ధర పలికాయి.

గరిష్టం/కనిష్టం

33.1°/21.5°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

24 మండలాల్లో వర్షం



పుట్టపర్తి సమీపంలో కురుస్తున్న వర్షం

పుట్టపర్తి అర్బన్: తుపాను ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ జిల్లాలోని 24 మండలాల పరిధిలో మోస్తరు వర్షం కురిసింది. సగటున 9.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా పుట్టపర్తి 26.4 మి.మీ, తలుపుల మండలంలో 24.6 మి.మీ, నల్లమాడ మండలంలో 24.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక బుక్కపట్నం మండలంలో 23 మి.మీ, కొత్తచెరువు 21.8, రామగిరి 20.6, సోమందేపల్లి 19.4, గోరంట్ల 19.2, రొద్దం 13.8, అమడగూరు 13.8, అమరాపురం 12.8, తనకల్లు 12.4, పెనుకొండ 11, ఓడీ చెరువు 10.2, కదిరి 7.2, అగళి 6.2, సీకేపల్లి 5.8, నల్లచెరువు 4.2, మడకశిర 4, ధర్మవరం 3.4, గాండ్లపెంట 2.8, కనగానపల్లి 2.2, ముదిగుబ్బ 2.2, ఎన్‌పీకుంట మండలంలో 2 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాకు మరో రెండు రోజులు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తాజా వర్షాలు ముంగారు పంటలకు మేలు చేస్తాయని వెల్లడించారు.

జగన్‌పై కేసు అక్రమం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



పెనుకొండ రూరల్: సత్తెనపల్లిలో ఘటనలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కేసు నమోదు చేయడం అక్రమమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రమాదవశాత్తూ సింగయ్య మృతి చెందడం బాధాకరమన్నారు. అందుకు ప్రభుత్వము, పోలీసులే బాధ్యత వహించాలన్నారు. జెడ్‌ప్లస్ భద్రత కలిగిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటనకు గట్టి బందోబస్తుతో పాటు రోప్ పార్టీతో భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అందువల్లే దుర్ఘటన చోటు చేసుకుందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఓ రాజకీయ నాయకుడి పర్యటనపై ఆంక్షలు విధించలేదని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో ఎక్కడా చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్‌ల పర్యటనలను అడ్డుకోలేదని, పైగా వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రత కల్పించామన్నారు.

జగన్ పేరు ఎఫ్ఐఆర్‌లో చేర్చడం చట్ట విరుద్ధం

- వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు మాలగుండ్ల శంకరనారాయణ



సాక్షి, పుట్టపర్తి: రెంటపాళ్లలో ఓ వ్యక్తి మృతి చెందిన కేసుకు సంబంధించి మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పేరును కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమేనని వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు, మాజీ మంత్రి మాలగుండ్ల శంకర్‌నారాయణ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చట్టం.. ఎవరి చుట్టం కాదని, రాజకీయాల్లో అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని చట్టాలను దుర్వినియోగం చేయకూడదన్నారు. కూటమి నేతలు అధికారాన్ని అడ్డు పెట్టుకుని పోలీసు వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు ప్రమాదం జరిగితే.. డ్రైవర్ కారణం అవుతాడు.. కానీ బస్సులోని ప్రయాణికులు కాదని తెలుసుకోవాలన్నారు. ప్రమాదం ఎలా జరిగిందో? ఎవరు చేశారనే దానిపై స్పష్టత వచ్చాకే కేసులో పేర్లను చేర్చాలన్నారు. అలా కాకుండా అధికారం ఉంది..ఇష్టానుసారం వ్యవహరిస్తామంటే న్యాయస్థానాలు ఊరుకోబోవని గుర్తుంచుకోవాలన్నారు.

27న 'దిశ' కమిటీ సమావేశం

అనంతపురం సిటీ: శ్రీసత్యసాయి జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ(దిశ) కమిటీ సమావేశం ఈ నెల 27న పుట్టపర్తిలోని కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు జెడ్పీ డిప్యూటీ సీఈఓ జి.వెంకటసుబ్బయ్య సోమవారం తెలిపారు. దిశ కమిటీ చైర్మన్, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి అధ్యక్షతన ఆ రోజు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో మంత్రులు, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ టీఎస్ చేతన్, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కమిటీ సభ్యులు హాజరు కానున్నట్లు వివరించారు. అన్ని శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశానికి కచ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు.

వంచనపై యువ గర్జన

- కూటమి సర్కారు తీరుపై యువజనాగ్రహం
- పుట్టపర్తిలో కదం తొక్కిన విద్యార్థులు, యువకులు
- గణేశ్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ
- ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్
- వైఎస్సార్ సీపీ 'యువత పోరు' విజయవంతం



కలెక్టరేట్ ముందు బైఠాయించిన యువజన, విద్యార్థి విభాగం నేతలు



డీఆర్ఓ విజయసారథికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పుట్టపర్తి: ఎన్నికల హామీలు అమలు చేయకుండా వంచించిన కూటమి సర్కార్ తీరుపై విద్యార్థులు, యువకులు కదం తొక్కారు. అలవిగాని హామీలతో నమ్మించి మోసం చేసిన చంద్రబాబుపై ధ్వజమెత్తారు. పాలన చేతగాని సీఎం వెంటనే దిగిపోవాలని నినదించారు. వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సోమవారం పుట్టపర్తిలో నిర్వహించిన 'యువత పోరు'కు విద్యార్థులు, నిరుద్యోగులు స్వచ్ఛందంగా తరలివచ్చి మద్దతు తెలపడంతో కార్యక్రమం విజయవంతమైంది.

భారీ జనసందోహంతో ర్యాలీ

ఉదయం పుట్టపర్తి పట్టణంలోని గణేశ్ సర్కిల్ నుంచి మొదలైన యువత పోరు ర్యాలీ కలెక్టరేట్ వరకు భారీ జన సందోహం మధ్య సాగింది. చంద్రబాబు మోసాలను వివరిస్తూ యువకులు ప్లకార్డులు ప్రదర్శించారు. నిరుద్యోగ భృతి ఏది బాబూ?.. ఇరవై లక్షల ఉద్యోగాలు ఎప్పుడిస్తావ్ బాబూ, చేతకాని సీఎం రాజీనామా చేయాలి.. అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ పుట్టపర్తి పుర వీధుల్లో చేసిన ర్యాలీకి భారీ మద్దతు లభించింది. అనంతరం విద్యార్థులు, నిరుద్యోగులు, యువత కలెక్టరేట్ ఎదుట బైఠాయించి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినదించారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు రూ.3 వేల భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, విద్యా, వసతి దీవెన బకాయిలు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి సహా ఆయా మండలాల ఎంపీపీలు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు, సర్పంచులు, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల నేతలు పాల్గొన్నారు.

రూ.7,800 కోట్ల బకాయిలు పెండింగ్

2024–25 విద్యా సంవత్సరానికి గాను ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు రూ.2,800 కోట్లు, హాస్టల్ నిర్వహణకు 1,100 కోట్లు, 2025–26 విద్యా సంవత్సరానికి రూ.2,600 కోట్లు మొత్తంగా రూ.7,800 కోట్లు కూటమి ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సి ఉందని వారు తెలిపారు. ఈ మొత్తాన్ని వెంటనే విడుదల చేసి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్ఓ విజయసారథికి అందించారు.



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న నిరుద్యోగులు, విద్యార్థి, యువజన సంఘాల నేతలు



ర్యాలీగా వెళ్తున్న విద్యార్థి, యువజన విభాగం నేతలు

నిండా ముంచిన చంద్రబాబు



రాష్ట్రంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు, ఇప్పటికే చదువులు పూర్తి చేసిన యువతను చంద్రబాబు ప్రభుత్వం నిండా ముంచింది. చదువుకునేందుకు ఆర్థికంగా చేయూత లేదు. అప్పు చేసైనా చదువు పూర్తిచేస్తే ఉద్యోగాలు లేవు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన ఒక్క హామీనీ చంద్రబాబు నెరవేర్చలేకపోయారు. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం క్రమం తప్పకుండా ఆర్థిక చేయూతనిచ్చి పేదల చదువులకు దోహదం చేసింది.

– గంగుల సుధీర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం

అన్ని వర్గాలకూ మోసం



చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యార్థులు, యువత, మహిళలు.. ఇలా అన్ని వర్గాలనూ మోసం చేసింది. తల్లికి వందనంలో అర్హులకు న్యాయం జరగలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థులకు చదువును దూరం చేశారు. విద్యార్థులపై దాడులతో పాటు వారు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి తీసుకువచ్చారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేవరకూ పోరాటం కొనసాగిస్తాం.

– పురుషోత్తం రాయల్, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం

చంద్రబాబుకు పాలించే అర్హత లేదు



విద్యార్థులు, యువతకు అలవిగాని హామీలిచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక ఒక్కటంటే ఒక్కటీ నెరవేర్చలేదు. ఉద్యోగం కల్పించకపోతే నిరుద్యోగ భృతి కింద ప్రతి నెలా రూ.3 వేలు ఇస్తామని ఆశపెట్టారు. పగ్గాలు చేపట్టి ఏడాది దాటినా భృతి ఊసే లేదు. ఇక విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, వసతులు కల్పిస్తామని చెప్పి మోసం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా వేధిస్తున్నారు. నమ్మించి మోసం చేసిన చంద్రబాబుకు పాలించే అర్హత లేదు.

– లింగారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం

బుద్ధిచెప్పి తీరుతాం



వైఎస్సార్ సీపీ హయాంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి మరీ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చేవారు. కానీ కూటమి ప్రభుత్వం ఒక్కటంటే ఒక్క ఉద్యోగమూ ఇవ్వలేదు. యువతకు రూ.10 లక్షల ఆర్థిక సాయం చేసి స్వయం ఉపాధికి అండగా నిలుస్తామన్న పవన్ కల్యాణ్ కూడా నేడు నోరు మెదపడం లేదు. యువకులు, విద్యార్థులను మోసం చేసిన కూటమి సర్కార్‌కు రానున్న రోజుల్లో బుద్ధి చెప్పితీరుతాం.

– అమర్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం

నిరుద్యోగుల ఉసురు తగులుతుంది



ఉద్యోగాలతో ఊరించి మోసం చేసిన కూటమి సర్కార్‌కు నిరుద్యోగుల ఉసురు తప్పక తగులుతుంది. విద్యార్థులకు, నిరుద్యోగులకు చంద్రబాబు చేసిన ద్రోహం అంతా ఇంతా కాదు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు క్రమం తప్పకుండా నిధులు విడుదల చేశారు.

– గంగాధర్ నాయుడు, యువజన విభాగం నేత, ధర్మవరం

నిరుద్యోగులకు కుచ్చుటోపీ



చంద్రబాబు నిరుద్యోగులకు కుచ్చుటోపీ పెట్టారు. అధికారం చేపట్టగానే ఉద్యోగాలిస్తామంటే యువకులంతా నమ్మారు. కానీ ఆయన అధికారం చేపట్టగానే తన కుమారుడికి ఉద్యోగం ఇచ్చుకున్నాడు. ప్రభుత్వశాఖల్లోని ఉద్యోగాలు భర్తీ చేయకుండా అన్యాయం చేశారు. పైగా వివిధ శాఖల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కింద పనిచేసే వారి ఉద్యోగాలు ఊడగొట్టారు. ఇంతమందిని బాధపెట్టిన కూటమి సర్కార్ కూలడం ఖాయం.

– మామిళ్లపల్లి అమర్‌నాథ్‌రెడ్డి, యువజన విభాగం నేత, రాప్తాడు

బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైంది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో యువతకు ఉపాధి కల్పించడంతో పాటు కార్పొరేట్ విద్యను ఉచితంగా అందించి పేద కుటుంబాలకు జగనన్న అండగా నిలిచారు. కానీ చంద్రబాబు నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్నారు. చదువుకునే వారి భవితనూ ప్రశ్నార్థకం చేశారు. అన్ని వర్గాలనూ మోసం చేసిన కూటమి సర్కార్‌కు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైంది.

– మనోజ్, యువజన నేత, హిందూపురం

ప్రశ్నిస్తే కేసులా?



నిరుద్యోగులను, విద్యార్థులను దారుణంగా మోసం చేసిన చంద్రబాబు సర్కార్‌కు పాలించే అర్హత లేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి అందిస్తామని ,ఉన్నత చదువులు చదివే విద్యార్థులను వివిధ పథకాల ద్వారా ఆర్థికంగా ఆదుకుంటామని చెప్పి మోసం చేశారు. పైగా ప్రశ్నించిన వారిపై అక్రమంగా కేసులు పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపిస్తున్నారు. నిరంకుశ కూటమి సర్కార్ కూలే రోజు త్వరలోనే ఉంది.

– బడా నాగార్జునరెడ్డి, యువజన విభాగం నేత, పుట్టపర్తి

మోసం ఆయన నైజం



మోసం చంద్రబాబు నైజం. అబద్ధాలు చెప్పడంలోనూ ఆయన దిట్ట. బాబు మాటిచ్చారంటే మోసం గ్యారెంటీ. ఇప్పటికే ఎన్నోసార్లు ఇది రుజువైనా యువకులు, విద్యార్థులు మరోసారి ఆయన మాటలు నమ్మి ఓట్లేశారు. కానీ ఆయన బుద్ధి మారలేదు. ఉద్యోగాలు లేవు. పోనీ నిరుద్యోగ భృతి ఇస్తారంటే అదీ లేదు. చదువుకుందామంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ అందదు. పైగా హామీలన్నీ నెరవేర్చానంటూ ఎదురుదాడికి దిగారు. మోసాల బాబుకు బుద్ధి చెప్పితీరుతాం.

– సందీప్ నాయుడు, యువజన విభాగం నేత, పుట్టపర్తి

అర్జీలకు మెరుగైన పరిష్కారం చూపాలి

- అధికారులకు డీఆర్ఓ విజయ సారథి ఆదేశం
- వివిధ సమస్యలపై 212 అర్జీలు



ఓ మహిళ నుంచి అర్జీ స్వీకరిస్తున్న డీఆర్ఓ విజయ సారథి

ప్రశాంతి నిలయం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందే అర్జీలకు మెరుగైన పరిష్కారం చూపాలని డీఆర్ఓ విజయ సారథి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పింఛన్లు, ఇంటి స్థలాలు, ఇంటి పట్టాలు, భూ సమస్యలు, సంక్షేమ పథకాల వర్తింపు తదితర వాటిపై మొత్తంగా 212 అర్జీలు అందాయి. కార్యక్రమం అనంతరం డీఆర్ఓ విజయసారథి మాట్లాడుతూ... కలెక్టరేట్‌కు వెళ్లి అర్జీ ఇస్తే సమస్యలు పరిష్కారమవుతాయన్న నమ్మకంతో జిల్లా నలుమూలల నుంచి ప్రజలు ఇక్కడి వరకూ వస్తారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తే సమస్యకు మెరుగైన పరిష్కారం చూపవచ్చన్నారు. ఆ దిశగా ప్రతి అధికారీ కృషి చేయాలన్నారు. అలాగే పెండింగ్ అర్జీల పరిష్కారంపై ఆయా శాఖల అధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారంపై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలన్నారు. అర్జీదారుడి సమస్య తీర్చడంలో ఏదైనా సమస్య ఉంటే ఆ విషయం అర్థమయ్యేలా వివరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో ఏ స్థాయిలోనూ నిర్లక్ష్యం పనికి రాదన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల జేడీలు సుబ్బారావు, చంద్రశేఖర్ రెడ్డి, శుభదాస్, ప్రజా రవాణా అధికారి మధుసూదన్, డీఎంహెచ్ఓ ఫైరోజా బేగం, డీపీఓ సమత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'సహకార' ఉద్యోగుల బాహాబాహీ



ధర్మవరం రూరల్: పట్టణంలోని ఎల్‌పీ సర్కిల్‌లో సోమవారం సహకార సంఘం ఉద్యోగులు బాహాబాహీకి దిగారు. నడిరోడ్డులో ఒకరిపై మరొకరు భౌతిక దాడులు చేసుకున్నారు. స్థానికంగా చర్చనీయాంశమైన ఈ ఘటన వివరాలు ఇలా... మండల పరిధిలోని గొట్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓగా గతంలో పనిచేసిన బొంత కేశవులు, ప్రస్తుత సీఈఓ నారాయణ స్వామి ముష్టి యుద్ధానికి దిగారు. ఉదయం ద్విచక్ర వాహనంపై డివిజన్ కార్యాలయానికి వెళ్తున్న నారాయణస్వామిని అడ్డుకున్న బొంత కేశవులు రోడ్డుపైనే దాడి చేశారు. ఈ దాడిలో నారాయణస్వామి వాహనం పైనుంచి కింద పడిపోయారు. రోడ్డుపైనే ఇద్దరూ బాహాబాహీకి దిగగా.. స్థానికులు ఇరువురికీ సర్ది చెప్పి అక్కడి నుంచి పంపించారు.

వ్యక్తిగత కక్షతో దాడి

బొంత కేశవులు వ్యక్తిగత కక్షతోనే తనపై దాడి చేశాడని సీఈఓ నారాయణస్వామి ఆరోపించారు. గతంలో గొట్లూరులో పనిచేసిన ఆయన.. బదిలీపై నార్పల మండలం బి.పప్పూరు గ్రామానికి వెళ్లాడన్నారు. అయితే అక్కడ రైతులు చెల్లించిన సొమ్మును బ్యాంకు ఖాతాకు జమ చేయకపోవడంతో ఉన్నతాధికారులు ఆయన్ను విధుల నుంచి తొలగించారన్నారు. అప్పటి నుంచి ఆయన తిరిగి గొట్లూరు సొసైటీకి వచ్చేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారన్నారు. ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతూ.. తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని నారాయణ స్వామి ఆరోపించారు.

అతని వల్లే నా ఉద్యోగం పోయింది

కాగా, సీఈఓ నారాయణస్వామి వల్లే తన ఉద్యోగం పోయిందని బొంత కేశవులు ఆరోపించారు. తాను వాడుకున్న రైతుల సొమ్మును తిరిగి బ్యాంకుకు చెల్లించినప్పటికీ తనను విధుల్లోకి చేర్చుకోకుండా నారాయణస్వామి అడ్డు చెబుతున్నాడన్నారు. దీంతో తాను నిలదీశాను కానీ దాడి చేయలేదన్నారు.

పశుమాంసం రవాణా కేసులో 11 మంది అరెస్ట్



పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

హిందూపురం: పశుమాంసం అక్రమ రవాణా ఘటనలో హిందూపురం పోలీసులు సోమవారం 11 మందిని అరెస్టు చేశారు. డీఎస్పీ మహేష్ తెలిపిన వివరాల మేరకు.. హిందూపురం నుంచి తరలుతున్న పశుమాంసాన్ని ఆదివారం తెల్లవారుజామున సంతేబిదనూర్ గేట్ వద్ద హిందూపురం రూరల్ సీఐ ఆంజనేయులు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే ఆరు వాహనాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు సోమవారం 11 మందిని అరెస్ట్ చేశారు. అలాగే స్వాధీనం చేసుకున్న 6.5 టన్నుల పశుమాంసాన్ని అధికారుల సమక్షంలో కిరికిరా డంపింగ్ యార్డ్ వద్ద పూడ్చివేశారు. అరెస్ట్ అయిన వారిలో హిందూపురానికి చెందిన ఫరూక్, ఆసీఫ్, అస్లాం, అసిపుల్లా బేగ్, మహమ్మద్ జుబేర్, మహమ్మద్ మౌలాసాబ్, షేక్ ఇమ్రాన్, షేక్ జబివుల్లా, కొలిమి జమీర్ ఖాన్, అఫ్రిద్, జాకీర్‌లు ఉన్నారు. అధికారుల అనుమతులతోనే మాంసం షాపులు నిర్వహించాలని, అక్రమంగా ఎవరైనా నిర్వహిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

క్లుప్తంగా

'పోలీసు స్పందన'కు 50 వినతులు



అర్జీదారుతో మాట్లాడుతున్న డీఎస్పీ ఆదినారాయణ

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 50 వినతులు అందాయి. డీఎస్పీ ఆదినారాయణ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్ట పరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజరీ సాయినాథరెడ్డి, ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు

ఎస్‌ఎస్‌ఈ బోర్డు కార్యాలయం మార్పు

అనంతపురం ఎడ్యుకేషన్: కృష్ణా జిల్లా విజయవాడలోని గొల్లపూడిలో ఆంధ్ర హాస్పిటల్ ఎదురుగా ఉన్న ఎస్‌ఎస్‌ఈ బోర్డు (ప్రభుత్వ పరీక్షల) కార్యాలయాన్ని గుంటూరు జిల్లా మంగళగిరిలోని కళాశాల విద్య కమిషనర్ కార్యాలయం పక్కన సర్వీస్‌రోడ్డులో ఉన్న గరుడవేగ టవర్స్‌లోకి మార్పు చేశారు. ఈ మేరకు డీఈఓ ప్రసాద్‌బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ తెలిపారు. సోమవారం నుంచి కార్యకలాపాలు అక్కడి నుంచే సాగుతున్నాయని పేర్కొన్నారు.

రైలు ఎక్కబోతూ కింద పడి యువకుడి మృతి



సుధాకర్ (ఫైల్)

తాడిమర్రి: రైలు ఎక్కబోతూ అదుపు తప్పి కిందపడి ఓ యువకుడు మృతిచెందాడు.. అనంతపురంలో రైల్వే స్టేషన్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు.. తాడిమర్రి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన కల్లే శ్రీరాములుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెను అదే గ్రామానికి చెందిన గోపాల్‌కు ఇచ్చి వివాహం చేశారు. కుమారుడు సుధాకర్(26) డిగ్రీ వరకు చదువుకుని తిరుపతికి వెళ్లేందుకు సిద్ధమైన సుధాకర్.. ఆదివారం సాయంత్రం అనంతపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. రాత్రి 8 గంటలకు ఉన్న కదిరిదేవరపల్లి–తిరుపతి ట్రెన్ తప్పిపోవడంతో సోమవారం వేకువజామున వచ్చిన రైలును ఆలస్యంగా గమనించి ఎక్కేందేకు సిద్ధమయ్యాడు. అప్పటికే రైలు ముందుకు కదలడంతో ఎక్కేందుకు ప్రయత్నిస్తూ పట్టు తప్పి కింద రైలు కిందపడి రెండు ముక్కలయ్యాడు. మృతుడి జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా తాడిమర్రి మండలం ఆత్మకూరు గ్రామ వాసిగా గుర్తించి ఇక్కడి పోలీసులకు రైల్వే పోలీసులు సమాచారం ఇచ్చారు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.



బస్సు కోసం రోడ్డుపై వేచి ఉన్న విద్యార్థులు

పుట్టపర్తి మండలంలోని జగరాజుపల్లిలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించకపోవడంతో విద్యార్థుల ఇబ్బందులు పతాకస్థాయికి చేరుకున్నాయి. ధర్మవరం – గోరంట్ల ప్రధాన మార్గంలో పుట్టపర్తికి ఒకటిన్నర కిలోమీటరు దూరం ఉన్న ఈ పాఠశాలకు సమీప గ్రామాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో పాఠశాల వేళకు రావడం, బడి వేళలు ముగిసిన తర్వాత ఇళ్లకు చేరుకోవడంలో తీవ్ర ఆలస్యమవుతోంది. ఇలా ఇంకెన్నాళ్లు అవస్థలు పడాలని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. చీకటి పడినా ఇళ్లకు చేరకపోవడంతో తమను బడి మానాలంటూ తల్లిదండ్రులు ఇబ్బంది పెడుతున్నారని పలువురు బాలికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– పుట్టపర్తి అర్బన్:

హామీలు నెరవేర్చడం చేతకాకపోతే గద్దె దిగండి



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు

- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలు
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రశాంతి నిలయం: ఎన్నికల సమయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అధికారం చేపట్టి ఏడాది గడిచినా పాలకులు పరిష్కరించలేకపోయారని, హామీలను నెరవేర్చే సత్తా లేకపోతే వెంటనే గద్దె దిగిపోవాలంటూ కూటమి ప్రభుత్వాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనలో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అంతకు ముందు స్థానిక గణేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాబున్నీషా, కోశాధికారి శ్రీదేవి మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించడంతో కనీసం రేషన్ కార్డుకు కూడా నోచుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్వో విజయసారథికి అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, నాయకులు జీఎల్ నరసింహులు, లక్ష్మీనారాయణ, పెదపల్లి బాబా సాంబశివ, దిల్షాద్, అంజి, గంగాధర్ , పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

చీటింగ్ టీచరుకు 'అధికార' అండ

- ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ నోటీసు ఇవ్వకముందే సస్పెన్షన్ ఎత్తివేత
- ఆ తర్వాత నోటీసు జారీ చేసిన అధికారులు
- విధుల్లో చేరి రెండు నెలలవుతున్నా నేటికీ ఇవ్వని వివరణ
- తెర వెనుక ఉంటూ మంత్రాంగం నడుపుతున్న ఓ ఎమ్మెల్సీ



కాకర్ల దివాకర్‌నాయుడు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, ప్రైవేట్ వ్యాపారులను చీటింగ్ చేసి కోట్లాది రూపాయిల కుంభకోణానికి పాల్పడిన ప్రభుత్వ టీచరు కాకర్ల దివాకర్‌నాయుడుకు అధికార పార్టీకి చెందిన కొందరు పెద్దలు అండగా నిలిచారు. ఈ క్రమంలో ఆయనపై కనీస చర్యలు తీసుకోకుండానే తాత్కాలికంగా సస్పెన్షన్ ఎత్తివేయించి ఉద్యోగంలో చేరేలా చేశారు. ఈ వ్యవహారం ప్రస్తుతం ఉపాధ్యాయుల్లో జోరుగా చర్చ సాగుతోంది. అనంతపురంలోని రాజేంద్ర నగర పాలక ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కాకర్ల దివాకర్‌నాయుడు చీటీల వ్యాపారంతో సుమారు రూ. 10 కోట్ల దాకా మోసానికి పాల్పడిన విషయం తెలిసిందే. అజ్ఞాతంలోకి వెళ్లిన తర్వాత కూడా అసలు విషయం తెలీక కొందరు కొన్ని నెలలు పాటు క్రమం తప్పకుండా చీటీల మొత్తం చెల్లిస్తూ వచ్చారు. ఆయన భాగోతాన్ని గతేడాది జూలైలో వరుస కథనాలతో 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. దీంతో బాధితులంతా అప్రమత్తమైనా అప్పటికే జరగాల్సిన నష్టం బాగా జరిగింది. కలెక్టర్, ఎస్పీని కలిసి విన్నవించడంతో వారి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత విద్యాశాఖ సస్పెన్షన్ వేటు వేసింది.

ఆ ప్రజాప్రతినిధి ఒత్తిడి మేరకు..

కాకర్ల దివాకర్‌నాయుడుకు తూర్పు రాయలసీమకు చెందిన ఓ ఎమ్మెల్సీ అండగా నిలిచినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేసి స్కూల్‌కు పంపాలని, జీతానికి ఇబ్బంది లేకుండా చూడాలంటూ అధికారులపై ఒత్తిళ్లు చేశారు. ఈ అంశంపై జిల్లా స్థాయి అధికారులు నిర్ణయం తీసుకోలేకపోయారు. దీంతో రాయలసీమ స్థాయి అధికారిపై ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలో దివాకర్‌నాయుడుకు ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ నోటీసు ఇవ్వకముందే సస్పెన్షన్ ఎత్తివేసి మే 1న అబుల్ కలాం స్కూల్‌కు కేటాయించారు. ఆ తర్వాత ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ నోటీసు ఇచ్చారు. దీనిపై ఆయన వివరణ ఇస్తే ఆ తర్వాత విచారణకు ఓ అధికారిని నియమిస్తారు. విచారణ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోనున్నారు. అయితే ఇప్పటిదాకా ఆయన వివరణ కూడా ఇవ్వలేదని తెలిసింది. ఇదే అంశంపై డీఈఓ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ.. 'దివాకర్‌నాయుడుపై సస్పెన్షన్ ఎత్తివేశాం. ఆ తర్వాత చార్జెస్ నోటీసు జారీ చేశాం. వివరణ ఇచ్చాడో లేదో తెలీదు. టీచర్ల బదిలీలు, పదోన్నతులు ఉండడం వల్ల కాస్తా ఆలస్యమైంది. వెంటనే వివరణ తీసుకుని విచారణ అధికారిని నియమిస్తాం. ఆలస్యం కాకుండా నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తాం' అని పేర్కొన్నారు.

లబోదిబోమంటున్న బాధితులు..

చీటింగ్ కేసు నిందితుడు దివాకర్‌నాయుడు దర్జాగా తిరుగాడుతుండగా మరోవైపు బాధితులు లబోదిబోమంటున్నారు. విలాసవంతమైన జీవితం గడుపుతూ తమ డబ్బు చెల్లించకుండా చుక్కలు చూపిస్తున్నాడంటూ వాపోతున్నాను. ఇలాంటి వారికి అండగా నిలిచిన ప్రజా ప్రతినిధులు తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

సహకార బ్యాంకులను లాభాల బాట పట్టిద్దాం

- డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి ముంటిమడుగు కేశవరెడ్డి



మాట్లాడుతున్న ముంటిమడుగు కేశవరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: సహకార బ్యాంకులను లాభాల బాట పట్టించి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచేలా చేద్దామని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఉద్యోగులకు ఆ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి ముంటిమడుగు కేశవరెడ్డి పిలుపునిచ్చారు. నూతనంగా ఆయన బాధ్యతలు తీసుకున్న అనంతరం సోమవారం స్థానిక డీసీసీబీ హాల్‌లో సీఈఓ కె.సురేఖారాణి అధ్యక్షతన జరిగిన 129వ మహాజన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు ప్రాధాన్యతనిస్తూనే మిగిలిన వర్గాలకు బ్యాంకింగ్ సేవలు అందించి సమష్టి కృషితో బ్యాంకు పురోభివృద్ధికి పాటుపడాలని కోరారు. 2024–25 ఆర్థిక సంవత్సరం ఆడిట్ రిపోర్టు, జమా ఖర్చులను మహాజనసభ ఆమోదించింది. అలాగే 2025–26 బడ్జెట్ కేటాయింపులపై చర్చించారు. గతేడాదికి సంబంధించి రూ.1.55 కోట్లను బైలా ప్రకారం వివిధ పద్దులకు కేటాయించారు. సమావేశంలో డీజీఎంలు, ఏజీఎంలు, మేనేజర్లు, పీఏసీఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం



నరేష్ (ఫైల్)

కనగానపల్లి: వ్యసనాలు మాని బుద్ధిగా ఉండాలని తల్లిదండ్రులు మందలించడాన్ని జీర్ణించుకోలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కనగానపల్లి మండలం దాదులూరు గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కేశవయ్య, ముత్యాలమ్మ దంపతులకు కుమారుడు నరేష్ (20), కుమార్తె ఉన్నారు. పదో తరగతి వరకూ చదువుకున్న నరేష్ ఆ తర్వాత పై చదువులకు వెళ్లకుండా సెంట్రింగ్ పనులతో కుటుంబానికి చేదోడుగా నిలిచాడు. ఈ క్రమంలో స్నేహితులతో కలసి వ్యసనాలకు బానిసగా మారి జులాయిగా తిరగసాగాడు. తండ్రి పలుమార్లు హెచ్చరించినా మారలేదు.

దీంతో ఆదివారం రాత్రి గట్టిగా మందలించి, గొర్రెల మంద వద్దకు కాపలాకు వెళ్లాడు. ఆ సమయంలోతల్లి, చెల్లి ఆరుబయట నిద్రిస్తుండగా ఇంట్లో పడుకున్న నరేష్ అర్ధరాత్రి దూలానికి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం నిద్ర లేచిన తల్లి ముత్యాలమ్మ తలుపులు తెరవగా దూలానికి వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమారుడిని చూసి గట్టిగా కేకలు వేసింది. చుట్టూపక్కల వారు అక్కడకు చేరుకుని అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ఆటోలో ప్రసవం..తల్లీబిడ్డ క్షేమం

సోమందేపల్లి: కాన్పు కోసం ఆస్పత్రికి తరలిస్తుండగా పురిటినొప్పులు ఎక్కువ కావడంతో మార్గ మధ్యంలో ఆటోలోనే ఓ గర్భిణి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పందిపర్తి గ్రామానికి చెందిన గర్భిణి మంజులకు ఆదివారం అర్ధరాత్రి పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో కుటుంబీకులు ఆమెను ఆటోలో సోమందేపల్లి ఆస్పత్రికి తీసుకువచ్చారు. అయితే మంజుల ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా హిందూపురం ఆస్పత్రికి తీసుకువెళ్లాలని వైద్య సిబ్బంది సూచించారు. దీంతో కుటుంబీకులు ఆమెను ఆటోలో హిందూపురం తరలిస్తుండగా.. మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువ కావడంతో వెంట వెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్త పల్లవి, హెల్పర్ ఉషా ఆటోలోనే మంజులకు కాన్పు చేశారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.



నవజాత శిశువును చూపుతున్న దృశ్యం

యువకుడి ఆత్మహత్య

ధర్మవరం అర్బన్: స్థానిక కేతిరెడ్డి కాలనీలో నివాసముంటున్న జూటరు చరణ్‌తేజ్ (27) ఆత్మహత్య చేసుకున్నాడు. మూడేళ్ల క్రితం మృతి చెందిన తండ్రి రామకృష్ణ జ్ఞాపకాలతో తీవ్ర మనోవేదనకు లోనైన చరణ్‌తేజ్ నాలుగు నెలలుగా అనంతపురంలోని ఓ ప్రైవేట్ మానసిక వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో చరణ్‌తేజ్ అక్కలు సరస్వతి, విజయలక్ష్మి సోమవారం చికిత్సకు పిలుచుకెళ్లారు. అనంతరం బోయవీధిలో నివాసముంటున్న సరస్వతి తన ఇంటికి పిలుచుకెళ్లింది. రాత్రి మొదటి అంతస్తులోని బెడ్‌రూమ్‌లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో హెల్పర్‌కు తీవ్ర గాయాలు



గాయపడిన కుమార్

ముదిగుబ్బ: మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం కరెంట్ షాక్‌తో హెల్పర్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. పాత గ్రామీణ బ్యాంకు వీధి సమీపంలో విద్యుత్ స్తంభానికి నిచ్చెన వేసుకుని విద్యుత్ తీగలు సరిచేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ ప్రసరించడంతో షాక్‌కు గురై పైనుంచి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించండి



డీఎంహెచ్ఓకు సమ్మె నోటీసు ఇస్తున్న ఆశా కార్యకర్తలు


ప్రశాంతి నిలయం: తమ న్యాయపరమైన సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలంటూ ప్రభుత్వాన్ని ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగంను కలసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. వేతనాలు పెంచాలని, లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 9వ తేదీలోపు సమస్య పరిష్కారం కాకపోతే సమ్మెలోకి వెళతామంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు సాంబశివ, నాయకులు గంగాధర్, శివ, ఫక్రుద్దీన్, ఆశా కార్యకర్తల యూనియన్ జిల్లా నాయకులు ముంతాజ్, శబరి, అంజినమ్మ, వరలక్ష్మి, మమత, గంగులమ్మ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత హత్య కేసులో భర్తకు రిమాండ్

కనగానపల్లి: మండల కేంద్రం కనగానపల్లిలో వివాహితను హత్య చేసిన కేసులో ఆమె భర్తను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. కనగానపల్లికి చెందిన వివాహిత కళావతిని శనివారం సాయంత్రం ముళ్లపొదల వద్ద ఆమె భర్త రాఘవ కొట్టి చంపిన విషయం తెలిసిందే. హతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు రామగిరి సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో కనగానపల్లి పోలీసులు విచారణ చేపట్టి సోమవారం నిందితుడు రాఘవను అరెస్ట్ చేశారు. అనంతరం ధర్మవరం కోర్టులో హాజరుపరిచి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

'పీఎం సూర్యఘర్'ను వేగవంతం చేయండి

- ఎస్పీడీసీఎల్ సీజీఎం వరకుమార్



మాట్లాడుతున్న సీజీఎం వరకుమార్

అనంతపురం టౌన్: పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా అందిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఏపీ ఎస్పీడీసీఎల్ సీజీఎం వరకుమార్ ఆదేశించారు. సోమవారం అనంతపురంలోని ఎస్‌ఈ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులు, బ్యాంకర్లతో ఆయన సమావేశమై మాట్లాడారు. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా విద్యుత్ వినియోగదారులు తమ ఇళ్లపై సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ఇంటి అవసరాలకు వినియోగించడంతో పాటు మిగులు విద్యుత్‌ను సంస్థకు విక్రయించుకునేందుకు అవకాశం ఉందన్నారు. కిలో వాట్ల వారీగా సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు బ్యాంకర్లు సైతం రుణాలను అందజేయాలన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రాయితీలను అందజేస్తోందన్నారు. పీఎం సూర్యఘర్ పథకానికి వచ్చిన దరఖాస్తులను ఆయా ప్రాంతాల బ్యాంకర్లుతో సమన్వయం చేసుకొని గ్రౌండింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఈఈ, ఏడీలను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ శేషాద్రి శేఖర్, ఈఈ జీవీ రమేష్, ఏడీలు శ్రీనివాసులు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మిరప రైతుపై సైబర్ వల

- బ్యాంక్ ఖాతా నుంచి రూ.2 లక్షలు మాయం
- కేసు నమోదు చేసిన పోలీసులు

బెళుగుప్ప: మండలంలోని శీర్పి గ్రామానికి చెందిన రైతు ఏకాంబరేశ్వర బ్యాంక్ ఖాతా నుంచి రూ.2 లక్షలను సైబర్ నేరగాళ్లు అపహరించారు. పోలీసులు తెలిపిన మేరకు... రైతు ఏకాంబరేశ్వర తనకున్న ఏడు ఎకరాల పొలంలో మిరప పంట సాగుతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇటీవల సాగు చేసిన పంట చేతికి రావడంతో మార్కెట్‌లో విక్రయించాడు. దీంతో కళ్యాణదుర్గంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లోని రైతు ఖాతా (5010 059 3095 411)కు రూ.2 లక్షలను వ్యాపారి జమ చేశాడు. ఈ క్రమంలో మరో పంట పెట్టేందుకు సిద్ధమైన రైతు రెండు రోజుల క్రితం పెట్టుబడుల కోసమని డబ్బు డ్రా చేసేందుకు బ్యాంక్‌కు వెళ్లాడు. అయితే బ్యాంక్ ఖాతాలో నగదు నిల్వ లేకపోవడంతో అధికారులను కలసి ఆరా తీశాడు. తన ఖాతా నుంచి ఈ నెల 11న రూ.లక్ష ఇండియా బ్యాంకుకు, అదే రోజు మరో రూ.లక్షను మహీంద్రా బ్యాంకు నగదు బదిలీ అయినట్లు బ్యాంక్ అధికారులు తెలపడంతో తన ప్రమేయం లేకుండా నగదు ఎలా బదిలీ అవుతుందని ప్రశ్నించాడు. ఆ సమయంలో బ్యాంక్ అధికారులు పొంతలేని సమాధానాలు ఇవ్వడంతో తాను మోసపోయినట్లుగా నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు.